
# మహాసభలు



అదిగో బయట కొట్టున్నాడు, ఎప్పటికీ అవసరమైనవి అన్ని పేర్లు చెప్పావా? మరిచిపోయావా? మరీ ఇన్ని పేర్లు మరిచిపోతే ఎలా! పెద్ద పెద్ద సత్యాలే మరిచిపోతున్నారు, ఈ చిన్న విషయం మరిచిపోతే ఏం వచ్చిందంటావా! కొన్ని విషయాలు మరిచిపోవడం మంచిది, కొన్ని గుర్తుంచుకోవడం మంచిది. కవిసం ధన్నా గుర్తుంచుకుని ఉండు.

ఇంతకీ ఎక్కడి కెళుతున్నా వంటావా? మళ్ళీ మొదటి కొచ్చావు. . .సరే! కాకతీయనగర్‌లో. . . వరంగల్లు జిల్లాలో కాదు. . . ఇక్కడే, హైదరాబాదులోనే కాకతీయనగర్ అని ఒకటి వెలిసింది. అక్కడ ప్రపంచ తెలుగు మహాసభలు జరుగుతున్నాయి. అక్కడి కెళుతున్నా . . ఏమిటీ. . . ఉగాది పచ్చడి తయారైన తరవాత కాస్త నోట్లో వేసుకొని వెళ్ళమంటావా?. . . అక్కర్లేదు. . . నువ్వు పచ్చడి తయారు చేసేసరికి అక్కడి సభలు అయిపోతాయి కానీ, నన్ను వెళ్ళనివ్వు. . . నేను ఉండమన్న తరవాత ఉండనంతే. . . ఉగాది పచ్చడి సభలు జరిగే చోట పెడతారట. కాబట్టి నువ్వు చేసే బోడి పచ్చడి కోసం నా టైమ్ వేస్టు చేసుకోమంటావా. . . ఏమిటీ. . . ఏమంటున్నావ్? తలంటుకూడా సభల దగ్గరే పోయించుకుంటే బాగుండేదంటావా! పచ్చడి మాత్రం పెడతారని తెలుసు గానీ, తలంట్లుకూడా వాళ్ళు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎక్కడా ప్రకటించినట్లు లేదు మరి. లేపోతే సభల వారిచేతే తలంటుకొని ఉండును.

• • •

'ఎవరయ్యా నువ్వు. . . అరే!. . . ఎవరయ్యా నువ్వు నా చెయ్యి పుచ్చుకొని

లాగుతావు పడిపోద్దు మీద?... ఓర్నీ ... నువ్వుటా! ఏమి టీ వేషం?... ఈ లాల్చీ, కండువా, పంచే! నిన్నసలు గుర్తు పట్టలేదుసుమీ! ఎవ్వడో ఈ పాత కాలం తెలుగుమాస్టారు అనుకుంటున్నా! ఊరికే ఉక్కిరిబిక్కిరయి పోతున్నా ననుకో ఆశ్చర్యంతో... ఏమంటావ్! తెలుగు మహాసభలకు నూరు పైసల తెలుగు వాడిలా వెళ్ళాలంటావా?... ఏమిటీ... పైగా పూర్తి తెలుగులోనే మాట్లాడాలా! హౌ ఈజిట్ పాజిబుల్లయినే! అడగడం మరిచాను, నీకు పంచె కట్టుకోవడంకూడా వచ్చా... నా కసలు రాదు. పుట్టింటగ్గర్నించి పాంట్సే. పెళ్ళిలోకూడా పాంటుతోనే కూర్చుందా మనుకుంటుండగా, మా తాత రొక్క పుచ్చుకొని లాక్కెళ్ళి నాకు పంచె కట్టాడు స్వయంగా... ఆ తరవాత మళ్ళీ కట్టలే. పంచె కడితే బాగుంటుందంటావా?... కానీ, ఇప్పు డొక్క పంచెకూడా లేదు ఇంట్లో నాకు. ఇప్పటికిప్పుడు ఏం కొని కట్టమంటావోయ్! పైగా పంచెమీదికి లాల్చీ బాగుంటుంది గానీ, బుష్షర్టు బాగుండదు గదా... నీకు పంచెలున్నాయా ... లేకపోతే అద్దెకు తెచ్చుకున్నావా ఈ బట్టలు?... ఎందు కలా కోపం తెచ్చుకుంటావ్! నీవేమి చెప్పరాదూ!

పోనిమ్మా, ఇప్పుడు నేను పంచె కట్టుకోవక పోతే సభంకి రానివ్వరా ఏమిటి! ముందసలు నాకు పంచె కట్టడం రాదు. ఒక వేళ కట్టుకున్నానే అనుకో, ఏ వేళ కైనా జారిపోవచ్చు. సభల దగ్గర పంచె ఊడిపోతే ఎంత ప్రమాదమో ఊహించావా? వీడెవడో, సభలను చెడగొట్టడానికి స్ట్రైకింగ్ చేస్తున్నాడని, వెంటనే ఉతికేస్తారు... నీ తలకాయ... మట్టిలో పడ్డ పంచెను కాదు ఉతికేది—నన్ను!

కనీసం పూర్తి తెలుగులో మాట్లాడమంటావా? ఇప్పుడు మాట్లాడ్డం లేదా? నాకు తెలుగులో ఎన్ని మార్కులొచ్చాయో చెబితే దంగయిపోతావు. మాటవిథై వచ్చాయ్... మొదటిసారి రెండో సారి, మూడో సారి వెళ్ళగా వచ్చిన మొత్తం మార్కులనుకో... అయితే మాత్రం... మాటవిథై మార్కులు నా దృష్టిలో ఎక్కువే. ఏమంటావ్... అచ్చ తెలుగులో 'మార్కులు' అన్నదానికి వేరే మాట చెప్పమంటావా... మొదటే గడ్డ సమస్య పెట్టేశావు... అవును మార్కులను అచ్చ తెలుగులో ఏం చెప్పాలి!... గుర్తు లనకూడదా?...

అదిగదిగో... కాకతీయనగర్ పొయ్యే నూనె బండి ఆగింది. నూనె బండిఅంటే అదేనోయ్ బస్సు. ఆయిల్ తో నడుస్తుంది గదా—అందుచేత 'నూనె బండి' అని అచ్చ తెలుగులో చెప్పా. అలా బాగా లేదా... మరి నన్నేం చెయ్య మంటావ్! సర్లే... ఎక్కు!

• • •

అదిగోనోయ్! అది నాగార్జునపీఠంట. సదస్సులన్నీ జరుగుతాయట ఇక్కడే.

## కొలను వేంకట దుర్గాప్రసాద్

అప్పుడే జనంతో నిండి పోయింది. సభ ప్రారంభమవుతున్నట్టుంది. లోపలి కెళ్ళి కూర్చుందాం, పద!

ఇదో... నీ పంచె గోచీ ఓ సారి చూసుకో. నాకు చాలా అనుమానంగా ఉంది. మరి అలవాటు లేనప్పుడు ఎందుకు కట్టుకోవడం? అయినా, ఇదివరకట్నించి లేని పూర్తి తెలుగుతనం ఇప్పుడు ఉన్నట్టుండి రమ్మంటే ఎలా వస్తుంది చెప్పు! క్రమ క్రమంగా అలవాటు చేసుకోవాలంతే!

అబ్బ! ఏం అరేంజ్‌మెంట్సు! ఏం అరేంజిమెంట్సు! సారీ... ఇంగ్లీషులో ... అయ్యో... అదే... ఆంగ్లంలో వాగేస్తున్నాను కదూ! అదేమిటి అలా ముందుకు దూసుకు వెళతావ్?... స్టేజీ... మరే... వేదిక దగ్గరగా ఎందుకు?... ఛాయాచిత్రాల్లో పడ్డానికా? నీ బొందలే. ఇవతలికి రా! ముందు పంచె సరిగా కట్టుకో. నా మాట విని ఇక్కడ కూర్చుందాం. నువ్వు నిలబడి ఉంటే తరవాత అవమానం పాలవుతావు.

అన్నట్టు... ఏమోయ్! పూర్తి తెలుగులో మాట్లాడానికి ఎంత అవస్థ పడిపోతున్నానో తెలుసా! ఇంక వేదిక్కి పోతున్నదనుకో... అది సరే! వేదిక మీద కూర్చున్న పెద్ద మనుషుల వెనక చూడు. చూశావా? అదేమిటి? ప్రపంచ తెలుగు మహాసభల చిహ్నం. అవునా! మరి బొమ్మ పైభాగంలో ఆంగ్లం లోనూ, హిందీలోనూ వ్రాశారు గానీ, తెలుగులో ఎక్కడ వ్రాశారోయ్? చూపించు! బొమ్మ క్రింది భాగంలో వ్రాసి ఉంటారు... కనిపించడం లేదంటావా? అయినా బొమ్మ పైభాగం లోనే తెలుగులో వ్రాస్తే ఎంత బాగుం డేది! తీసుకెళ్ళి అడుగున వ్రాయడం ఏం బాగా లేదు. తెలుక్కి ప్రాముఖ్యం ఇవ్వలేదు చిహ్నంలో. నువ్వెందుకూ ఏడుపు మొహం పెడతావ్? నే నడిగిం దానికి నువ్వేమీ జవాబు చెప్పనక్కర్లేదులే.

అన్నట్టు... ఏమోయ్... ప్రత్యేక తపాలాబిళ్ళ విడుదల చేస్తున్నారట ఈ సందర్భంలో. వేదిక మీద పైన ఉన్న పటం అదే అనుకుంటా. బాగుందోయ్! ... దానిమీద తెలుగులో ఏదో వ్రాసి ఉందికూడాను... ఉండు, నే చదువు తాను... నీ కుసలే వస్తారం...

దేశభాష—తెలు—ఎంద—హాను అందరి సములు—రకన్న—సంకన్న—తే కలుగు—లందు—గులెస్స. రోమ—భావులు — కి పంచ—సంచదా— పనసత — కమ్మని — నుతెమిన్న.

ఏం భాషిది? తెలుగే! ఛ!... నిజంగానా? మరేమిటి అర్థం లేకుండా ఉంది. నేను సరిగా చదవలేదా? నేను తెలుగువాణ్ణే కాదా? పట్టి వెధవనా? అలా మొహమాటం లేకుండా మాట్లాడకు! నాకు చిరాకు... ఏమిటి అలా చదవకూడదా దాన్ని... ఈ వరసా, ఆ వరసా కలిపి చదవాలా?... ఓర్నీ!... అదా సంగతి? రోజూ దిన పత్రికలో ఒకటో కాలం తరవాత రెండో కాలం చదువుతాం కదా— అదే పద్ధతనుకొని చదివా ఈ తపాలా బిళ్ళ మీది వ్రాత కూడా. అయితే ఇప్పుడు సరిగా చదువు తాను కాసుకో!


దేశ భాషలందు తెలుగు లెస్స. ఎందరో మహానుభావులు అందరికీ వందనములు. పంచదార కన్న పనసతొనల కన్న, కమ్మని తేనె కన్న తెలుగు మిన్న.

ఇలా చదివితే కాస్త బాగున్నట్టుగా ఉందిస్మీ!

• • •

(సాయంత్రం.)

లోపలి కెళ్ళి కూర్చుందాం, గాలరీలో. తరవాత జనం వచ్చేస్తారు. బోలెడు ఇబ్బందులపాలయిపోతాం.



ఓహో... ఓహో... ఎన్ని టెలివిజన్ సెట్లు! ఎన్ని టెలివిజన్ సెట్లు! 'టెలివిజన్'కి తెలుగు పదం చెప్పమంటావా? నే చెప్పను. ఇక ఇటువంటి పరీక్షలు పెట్టకు—పాసు కాలేను.

చుట్టూ గాలరీ స్తంభాలకు వర్ణచిత్రాలు పెట్టారే! వీళ్ళంతా ప్రముఖులు కదా? ఈ పద్ధతి బాగుందోయ్. కానీ, కొన్ని వర్ణచిత్రాలకు ఆ మనిషి ఎవరో వివరించలేదు. నా లాంటి వాడికి ఎలా తెలుస్తుంది చెప్పు! ఇది అల్లూరి సీతారామరాజు అనుకో. అదిగో... టంగుటూరి... గాంధీగారు... వేమన ... మరి కొన్ని చెప్పొచ్చు అనుకో, పేరు వివరించకపోయినా. పోన్లెద్దూ... ఇప్పుడా బొమ్మలు ఎవరివో తెలియకపోతే వచ్చిన నష్టమేముంది?

అన్నట్టు... ఏమోయ్... ఒక రాజకీయ నాయకుణ్ణి సన్మానం చేస్తాం అని పిలిస్తే, 'సన్మానం' అంటే మరో అర్థం తీసుకొని, నేను రాను... నేను రాను... అన్నాట్ట. నిజమేనా ... లేపోతే రూమరా! అదే పదంతా!

రారా.. ముందు గాలరీలో కూర్చుందాం. జనం ఏమిటి అలా ప్రవాహంలా వచ్చేస్తున్నారు? త్వరగా పైకి ఎక్కు. లేపోతే వాళ్ళ కాళ్ళ క్రింద ఉగాది పచ్చయిపోతాం. ఇదిగో, ఈ టెలివిజన్ దగ్గర కూర్చుందాం. అమ్మయ్య... అరె...నా ఒళ్ళో కూర్చుంటా వేమిటి... సరిగా కూర్చో... చోటు లేదా... మరి ఎలాగో అలా సర్దుకో.

ఓర్నీ... పైన రేకులు. అందుకే ఇలా ఉడికి పోతున్నాం. గాలి అన్నమాట లేదు. ఎరక్కపోయి వచ్చాం. ఇలా ఎంత సేపు కూర్చుంటాం గాల్లేకుండా. అందరిలా కూర్చోమంటావా...

ఆలస్యమయింది గదా. ఇంకా కార్యక్రమాలు ప్రారంభించరేం? వేళకు ప్రారంభించకపోవడంకూడా తెలుగుతనమా?

ఈ గాలరీలో కన్నా ఆ మైదానంలో కూర్చుంటే బాగుండేది. కానీ, ఆ స్థలం ప్రతినిధులకు మాత్రమేనట! పాతిక రూపాయలిచ్చి అట్లా పోయినా బాగుండేది. ప్రాణం హాయిగా ఉండును.

చెమటకి నీ చొక్కా, నా చొక్కా తడిశాయి. ఒళ్ళుకూడా చిలకడదుంపలా ఉడికిపోయింది అనిపిస్తుంది. ఇదిగో ... ఇదిగో... ఒంటిమీది చర్మం కాగుతుంటే వచ్చేస్తుంది చూడు... పెంపమీది పొట్టులా. ఓరి నాయనో ... ఇలా అయితే బతికినట్టే!

అమ్మయ్య... టెలివిజన్ ప్రారంభమయింది. జన్మలో టెలివిజన్ చూడ్డం ఇదే మొదటిసారి. చాలా బాగుందోయ్ ... రేపొకటి కొనుక్కోవాలి... ఏమిటీ ... ఇంకా టైముందా... అప్పుడే కొనకూడదూ... టీవీ స్టేషనా... అది పెట్టాకే కొనాలా... అదా సంగతి ... ఏమిటో సృష్టి విచిత్రం!

ఇదిగో... ఎవరమ్మా నువ్వు... ఇలా పక్కన... మగాళ్ళ పక్కన... అందులో నా పక్కనే కూర్చున్నావు... ఏమ... ఏమన్నా బాగుందా... ఏమిటి టెలివిజన్ చూడ్డానికా... ఏమిటి... అక్కడ కూర్చుంటే కనపడ్డం లేదా... అయితే మాత్రం... ఇలా పక్కన... అయ్యో... (కొంప దీసి ఎవరూ చూడ్డం లేదు గదా. ఈమెకు పాతికేళ్ళు కూడా ఉన్నట్టు లేవు. ఇలా టెలివిజన్ మోజులో ఎక్కడ ఏ స్థితిలో కూర్చున్నదీ తెలిసినట్టు లేదు). సరే... కూర్చో ... నా దేం పోయింది!

అందరి కళ్ళూ టెలివిజన్ మీదే! ఓహో... ఇదంతా మహాసభల మీద అభిమానం కాదన్నమాట. టెలివిజన్ మీద మోజు... అంతే. 'భావసమైక్యం సాధించడం కోసం ఇలా మహాసభలు ఏర్పాటు చేశా'రనుకుంటున్నారు. దానికి ప్రభుత్వ యంత్రాంగం మంత్రాంగాల కన్నా, ఈ టెలివిజన్ సెట్లే బాగా తోడ్పడినట్లున్నాయి. ఏమోయ్! ! అంతేనా?


ఏమోయ్!... ఆ మైదానంలో కూర్చున్న ప్రతినిధుల కన్నా మనమే నయమనుకుంటా. మనం టెలివిజన్‌లో నన్నా వేదిక మీది వాళ్ళను స్పష్టంగా చూడగలుగుతున్నాం. పాపం వాళ్ళు అటు వేదిక మీది వాళ్ళను చూడలేకపోతున్నారు ... ఇటు టెలివిజన్ సెట్లూ లేవు.

నాయనా... ఇప్పటిదాకా టెలివిజన్ మోజులో పడి చెమటతో చచ్చిపోతున్నా కూడా ఈ రేకుల కింద కూర్చున్నాను. ఇక నేను కూర్చోలేను. నాలిక పిడచ గట్టుకు పోతూంది. ప్రాణం పొయ్యేట్టుగా ఉంది.

ఈ ఉపన్యాసాలన్నీ రేపు పత్రికలో చదవచ్చులే. లేలే... పద పోదాం... గాలరీ దిగి ఇటు ఎడం చేతి వేపు పోదాం ... అక్కణ్ణించి బయటి గేటుకు దారి ఉంది... బాబూ, అమ్మా... మేం వెళుతున్నాం. కాస్త దారివ్వండి...

అటు వెళదాం రావోయ్... జనం అటే పోతున్నారు బయటికి. మనలాగే చాలా మందికి బోరు కొట్టినట్టుంది. నా చెయ్యి పుచ్చుకో... జనంలో కలిసి పోదాం...

అబ్బ!... ఏమి టీ తోపుడు. నాకు గాలి ఆడ్డం లేదు. నా చెయ్యి పుచ్చుకో



ముళ్ళు! ముళ్ళు! ఫోటో—పి. ఎ. వివేకానందన్ (మద్రాసు)

... పడంక. నీ కాళ్ళు, క్రింద నేంమీద ఆనుతున్నాయా? నాకు అవడం లేదులే... అందుకని... నే నసలు నడవడం లే... ఈ జనం ప్రవాహంలో వెళ్ళిపోతున్నా... అమ్మో... నా చెయ్యి... నాయనోయ్... నా కాలు ... ఏమిటి? నన్ను కొడతావ్... నీకు బుద్ధుందా అసలు? చేతిలో కర్ర... నెత్తిమీద టోపీ ఉందని ఎవర్ని పడితే వాళ్ళని కొట్టడమే?... ఏమిటి?... ఈ దారిని పోకూడదా! మరి అలా చెప్పరాదు!... మళ్ళా అంతా వెనక్కి తిరగండి! అటు వేపు మరో ద్వారం ఉంది... బయటి కెళ్ళడానికి...

అయ్యో! పాపం... ఎవరో ఆడ కూతురు ఉక్కిరి బిక్కిరయి పోతూంది. ... ఈ జనప్రవాహంలో. ఇదిగో... ఆవిడ చంకలో పిల్లాడు గుక్క పట్టి ఏడుస్తున్నాడు. రామ రామ... ఆవిడ జాకెట్టు చిరిగిపోయింది... ఏమిటే... జనం... వెనక్కి వెళ్ళరు... ముందుకీ వెళ్ళరు... పాపం... అమ్మాయి ఎలా నలిగిపోతూందో... ఈ ప్రవాహంలో ధన మాన ప్రాణాలు తెలియకుండా పోయేట్టున్నాయి... భగవంతుడా! నన్నూ, నా మిత్రుణ్ణీ ... త్వరగా బయటికి చేర్చు...

హమ్మయ్య... ఎట్టకేలకు బయట పడ్డాము. ఇతగాడేడీ... పాపం జనంలో ఎక్కడ ఉన్నాడో బయటికి రాలేక. అన్నట్టు... నా కుడికాలు అదోలా ఉందేమిటి తెలికగా... ఓర్నీ! చెప్పు ఎక్కడో పోయింది. అయితే ఇక ఈ చెప్పుకూడా ఎందుకు దండగ.

అమ్మో... బంగారం లాంటి చొక్కాకూడా చిరిగింది! దేవుడోయ్ ... తలమీద మంటగా ఉందేమిటి... పోలీసాయన ఇందాక కర్ర పెట్టి ఊరికే నెత్తిమీద ఇలా అన్నాడు. దాని తాలుకు బొప్పి కట్టినట్టుంది... ✱